

మెగా జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల గుమడాం వైటిసిలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేళాకు మొత్తం 389మంది హాజరు కాగా, 103మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలను యువకులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు,వైటిసి మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.



బంద్‌తో నిర్మానుష్యమైన గుమ్మలక్ష్మీపురం కూడలి

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై

భగ్గుమన్న గిరిజనం

- మన్యం బంద్ సంపూర్ణం • భారీ ర్యాలీ, రాస్తారోకో

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన సంఘం, గిరిజన సంఘాలు జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం చేపట్టిన మన్యం బంద్ జిల్లాలో విజయవంతమైంది. దుకాణాలు మూతపడడం, వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో మన్యం బోసిపోయింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ పలుచోట్ల భారీ ర్యాలీలు నిర్వహించిన నిరసనలు తెలిపారు. పలు గ్రామాల్లోకి వాహనాలు రానీయకుండా రహదారి మధ్యలో కర్రలు అడ్డుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో సహ అన్ని ఏజెన్సీ మండలాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ బంద్‌కు సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, వివిధ ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. పలుచోట్ల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా బంద్‌లో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజన జెఎసి, అఖిలపక్షం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీలు, రాస్తారోకోలు చేశారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ గిరిజన ద్రోహి అంటూ మండిపడ్డారు. బంద్ కారణంగా గుమ్మ లక్ష్మీపురం ఎల్విన్ పేట గ్రామాల్లో వస్త్ర వాణిజ్య సముదాయాలు హోటళ్లు మూతపడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పహరా కాశారు. బంద్‌కు ఎపి గిరిజన సంఘం, సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ నాయకులు, యుటిఎఫ్, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ 1/70, అటవీ హక్కులు, పీసా, ఉపాధి హామీ చట్టాలు పటిష్టంగా అమలు చేయడం లేదన్నారు. జిఒ 3ను రద్దు చేశారని అన్నారు. అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ పోరాటానికి సంఘీభావం తెలపాలని, లేదా నైతిక బాధ్యతగా రాజీనామా చేసి నిరసన తెలపాలని కోరారు. లేకుంటే గిరిజన జాతి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. గిరిజన జెఎసి నాయకులు నిమ్మక సింహాచలం మాట్లాడుతూ గిరిజనులకు ద్రోహం చేస్తారా అంటూ మండిపడ్డారు. నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజనులంతా ఐక్యమత్యంగా లేకుంటే జగన్ ప్రభుత్వం గిరిజన హక్కులను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, నాయకులు బిడ్డిక శంకర్రావు, పువ్వల మోహన్‌రావు, సవ్వారావు, గిరిజన జెఎసి నాయకులు నందివాడ కృష్ణబాబు, టిడిపి నాయకులు బిడ్డిక పద్మావతి, కడ్రక కళావతి, మండంగి భూషణ, బిడ్డిక కొండలరావు, లోవరాజు, దుమ్మంగి, తాడికొండ సర్పంచు పాలక క్రాంతికుమార్, మండంగి జగ్గారావు, ఇరిడి ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గాంధీ, అంబేద్కర్ విగ్రహాల కు వినతులు

సాలూరు: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో ఎపి ప్రభుత్వం తీర్మానం చేయడానికి నిరసనగా నిర్వహించిన మన్యం బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎపిగిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు, గిరిజన సంఘాల జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయ్ కుమార్,మజ్జి నారాయణరావు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక బోసు బొమ్మ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు నిస్సిగ్గుగా ఒక్కరూ ప్రభుత్వ తీర్మానాన్ని వ్యతిరేకించకపోవడం అన్యాయమని అన్నారు.

తీర్మానం రద్దు చేయాలి

బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల జెఎసి నాయకులు జన్ని పైడిరాజు, కె.జానకీరావు, ఎస్‌ఎఫ్ఐ డివిజన్ నాయకులు వరుణ్ డిమాండ్ చేశారు. బంద్‌లో భాగంగా బంగారమ్మపేటలోని అంబేద్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు.

పటిష్టమైన బందోబస్తు

మన్యం బంద్ సందర్భంగా పట్టణం లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు.

సాలూరు రూరల్ : మన్యం బంద్ సందర్భంగా మండలంలోని దత్తివలసలో నిరసన తెలిపారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ తమ పదవుల కోసం జాతికి తీవ్ర నష్టం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తీర్మానాలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి జి.సంధ్యారాణి, జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయ్, సంఘంరెడ్డి జయసింహ, కోట లక్షణరావు, మజ్జి నారాయణ రావు, ఒంటి పరమేష్, సర్పంచులు, ఎంపీటీసీ లు గిరిజనులు పాల్గొన్నారు

జియమ్మవలస : మండల కేంద్రంలోలో మన్యం బంద్ విజయవంతమైంది. గిరిజన జెఎసి నాయకులు నిమ్మక జయరాజు, కూరంగి సీతారాం ఆధ్వర్యంలో ర్యాలీ, బంద్ నిర్వహించి నిరసన తెలిపారు.

కొమరాడ : మన్యం బంద్ మండల కేంద్రంలో పోలీసు ప్రహారా మధ్య ప్రశాంతం జరిగింది. గిరిజన సంఘం, జెఎసి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు వద్ద అంతరాష్ట్ర రహదారిపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయకులు హిమరిక రామారావు, లక్ష్మయ్య, జెఎసి నాయకులు బిడ్డికి తమ్మయ్య, గంగాధర్, ప్రజాసంఘాల నాయకులు కొల్లి సాంబమూర్తి, ఎ.ఉపేంద్ర, రెడ్డి శివున్నాయుడు, గౌర్నాయుడు, ప్రసాదు, తిరుపతిరావు, లక్ష్మణరావు, రామారావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరిజన సంఘ నాయకులు, యువత పాల్గొని దుకాణాలను మూయించివేశారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం చేశారు. బంద్‌నుద్దేశించి మాజీ ఎమ్మెల్యే కోలక లక్షణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చే తీర్మాణాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేనిచో భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తాడంగి రామారావు, పితిరుపతి, వి.తిరుపతిరావు, పి.సురేష్, పిసత్యనారాయణ, కె.తిరుపతిరావు, బాబ్జీ పాల్గొన్నారు.

2న రౌండ్ టేబుల్ సమావేశం

కలెక్టరేట్ : బోయ వాల్మీకిలను ఎస్‌టిలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 2 పార్వతీపురం లోని 'గిరిజన సామాజిక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. గిరిజన సంఘాలతో పాటు రైతుకూలీసంఘాలు, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని గిరిజన సంక్షేమసంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

తూర్పు ముఠాలో మన్యం బంద్ ప్రశాంతం

మండలంలో తూర్పు ముఠా మొండెంఖల్, నీలకంఠాపురం గ్రామాల్లో వైసిపి గిరిజన ప్రజా పతినిధులు ఎ.మన్మధరావు, ఐ.గౌరీశంకర్ మన్యం బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, రెండు జిల్లాల ట్రైబల్ ఫారం అధ్యక్షులు ఐ.రామకష్ణ, గిరిజన సంఘం నాయకులు ఎం.అడ్డమేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: గిరిజన సంఘం ఆధ్వర్యంలో సింగనవలస జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు నిరసననుద్దేశించి మాట్లాడారు. గిరిజనుల న్యాయమైన పోరాటానికి కార్మిక వర్గం మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ప్రతినిధులు ఎస్.చిన్నారావు, ఎస్.రమేష్, ఎ. ఒరియా, వి. చంప, ఎస్. మజ్జియ, ఎ. గబ్రిలు, కెవిపిఎస్ మండల కార్యదర్శి దూసి దుర్గారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు కండపు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఆదివాసీ జెఎసి, గిరిజన సంఘాలు గిరిజనులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. షాపులు స్వచ్ఛందంగా మూసివేశారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ పోరాడుతామని, జిఒ 3ను పునరుద్ధరించాలంటూ దోనుబాయి కూడలి వద్ద బైఠాయించారు. మానాపురం వద్ద ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బిడ్డిక అప్పారావు, జెఎసి నాయకులు బి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, శ్రీను, భాస్కరరావు, హిమరక ప్రసాద్, విశ్రాంతి ఎస్‌డిసి ధర్మారావు, రామస్వామి, ఎ.గంగాధర్, సాంబయ్య, శ్రీరాములు, కృష్ణారావు, నిమ్మక కాంతారావు, కె.కాంతారావు, సవరతోట ముఖలింగం, దమయంతి నాయుడు, సర్పంచ్ కళావతి, పడాల భూదేవి, ముటక రవి పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఆదివాసీలను ఎస్టీ ఎమ్మెల్యేలు నమ్మకద్రోహం చేస్తున్నారని ఆదివాసి జెఎసి నాయకులు విమర్శించారు. జెఎసి ఆధ్వర్యాన పార్వతీపురం కాంప్లెక్స్ కూడలి నుండి ఐటిడిఎ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటిడిఎ కార్యాలయంలోని అడవి తల్లి విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేసి పూలదండ వేశారు. ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జనరల్ సెక్రటరీ కె.జయన్న, వైస్ చైర్మన్ కడ్రక రామస్వామి, జాయింట్ సెక్రటరీ దుక్కా సీతారాం మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బోయ వాల్మీకిలపై చేసిన తీర్మానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి మంచాల పారమ్మ జెఎసి నాయకులు ఆరిక చంద్ర శేఖర్, బిడ్డక రామారావు, ఆరిక ప్రభాకరరావు, పి.రంజిత్‌కుమార్, సీదరపు రాజు, యు.నాగార్జున, కొండతామర సోమేశ్, సీదరపు సూరయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మర్రి సీతారాందొర, వి.సుందర్రావు, ఎంపిటిసి పాలక రాము తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : గిరిజన సంఘాల నాయకులు మంచాల శ్రీనివాసరావు, పడాల తమ్మయ్య, మంచాల ఈశ్వరరావు, సూర్రు రామారావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. బంద్ సందర్భంగా ముందస్తుగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావును పోలీసులు గృహనిర్బంధం చేశారు.

భామిని : గిరిజన ఐక్యవేదిక, గిరిజన సంఘం జెఎసి ప్రతినిధులు కొండగొర్రి భాస్కరరావు, బిడ్డిక కృష్ణారావు ఆధ్వర్యం లో భామినిలో ముందస్తుగా దుకాణ సముదాయాలను మూసివేశారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎన్.అప్పారావుకు వినతిని అందజేశారు. కార్యక్రమం గిరిజన ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కీర్తిరాయి సుగ్రీవులు, ఎన్.మోహనరావు, సర్పంచ్ నిమ్మల కేశవ, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఎపి గిరిజన సంఘం, ఆదివాసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మక్కువలో ఆందోళన చేపట్టారు. స్థానిక సువర్ణముఖి నది నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుందర్రావు, ఆదివాసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో ర్యాలీ, రాస్తారోకో చేస్తున్న గిరిజనులు, నాయకులు





సాలూరు మండలం దత్తివలస వద్ద, సీతంపేట మండలం బోనుబాయి కూడలి వద్ద బైఠాయించిన గిరిజనులు





పాచిపెంట, పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులు



సాలూరు మండలం మరిపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

అకాల వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న, అరటి

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలో శుక్రవారం వీచిన ఈదురు గాలులు, వడగళ్ల వర్షంతో సుమారు మండలంలో 500 ఎకరాల వరకు అరటి, 300 ఎకరాల వరకు మొక్కజొన్న నేలమట్టం జరిగింది. మామిడిపల్లి, మరిపల్లి, మావుడి, కందులపదం, కురుకుట్టి, కొత్తుపరువు, అన్నంరాజువలసలో భారీగా మొక్కజొన్న, అరటి నేలకొరిగింది. దీంతో చేతికొచ్చిన పంట నేలపాలైందని బాధిత రైతులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.

మక్కువ: మండలంలోని ఈదురు గాలులతో కూడినవర్షం పడడంతో మొక్కజొన్న రైతులకు అపార నష్టం సంభవించింది. మరో నెల రోజుల్లో పంట చేతికొస్తున్న తరుణంలో వర్షం రైతు కంట కన్నీరు మిగిల్చింది. మండలంలో దాదాపు అన్ని ప్రాంతంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు అపారనష్టం కలగడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు ఇదిలా ఉండగా ఈదురుగాలులు, వడగళ్ల వాన కారణంగా ఎక్కడకక్కడ చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది మార్కొండపుట్టి, దుగ్గేరు ఫీడర్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది

ఉద్యమంలా చిరుధాన్యాల వినియోగం : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

చిరు ధాన్యాల వినియోగం ఉద్యమంలా సాగాలి కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. చిరు ధాన్యాల ఉపయోగం వల్ల ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. చిరు ధాన్యాలను ప్రతి ఒక్కరూ తినాలని, భవిష్య తరాలు శత శాతం చిరు ధాన్యాలు తినేలా బాటలు వేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంలో భాగంగా చిరు ధాన్యాల మహెూత్సవాన్ని స్థానిక ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ శుక్ర వారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్కువ ఆదాయ వర్గాలు మాత్రమే తింటారు అనే ప్రజల్లో మానసికమైన ఆలోచనా విధానం కూడా చిరు ధాన్యాలు తగ్గుదలకు కారణమన్నారు. హరిత విప్లవంలో వరి, గోధుమ పంటలు ఎక్కువగా పండించడం ప్రారంభించడం, చిరు ధాన్యాలు తగ్గించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రజల్లో రక్త హీనత ఎక్కువగా కనిపిస్తున్నాయని, హైపర్ టెన్షన్, మధుమేహం కేసులు ఫ్యామిలీ డాక్టరు విధానం పరీక్షలలో కనిపిస్తుందని చెప్పారు. శారీరక వ్యాయామం తగ్గుదలే ఇందుకు ఒక కారణమని అన్నారు. చిరు ధాన్యాల వల్ల ఆహార భద్రత వస్తుందని, ఈ పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, చిన్న సన్నకారు రైతులు ఇబ్బందులు లేకుండా పండించవచ్చని సూచించారు. చిరు ధాన్యాల ఉత్పత్తి పెంచాలని, వ్యవసాయ శాఖ సరైన మార్గదర్శత్వం ఇవ్వాలని పేర్కొన్నారు. వ్యసాయశాఖ జెడి కె.రాబర్టుపాల్ మాట్లాడుతూ జిల్లాలో 4 వేల ఎకరాల్లో చిరు ధాన్యాల పంటలు వేస్తున్నారని, ప్రస్తుతం 4 వందల ఎకరాల్లో పంట ఉందని అన్నారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఎకరాకు 2 నుండి 3 బస్తాలు దిగుబడి వస్తుందని, విత్తనాల రకాలు మార్చుకొని దిగుబడి పెంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి తదితరులు మాట్లాడారు. కెపిఎం పాఠశాల విద్యార్థిని బి.బాంధవి ఆంగ్లంలో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. అనంతరం చిరు ధాన్యాలను సాగు చేస్తున్న రైతులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో టి.పి.ఎం.యు ఏపిడి వై. సత్యం నాయుడు, రస్తాకుంటుబాయి కెవికె శాస్త్రవేత్త తేజేశ్వరరావు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సామరస్యంగా భూ సమస్యలు పరిష్కరించుకోవాలి : సబ్‌కలెక్టర్

వీరఘట్టం: భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప పంతాలకు పోకూడదని సబ్ కలెక్టర్ నూరల్ కమర్ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులు పరిశీలించిన ఆయన మాట్లాడారు. చిన్న సమస్యలను పెద్దగా చేసుకుని కలహాలుపెంచు కోవడం సరికాదన్నారు. ఇటీవల నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తలవరం, కత్తులకవిటి, చిట్టి పూడివలస తదితర గ్రామాల రైతుల నుండి భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట డిటి వై సూర్యనారాయణ, ఆర్ఐ ఎస్ మారుతీరావు, విఆర్‌ఒలు , రైతులు ఉన్నారు.



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

గోడ కూలి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

గోడ కూలి ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన మండలంలోని సర్వపాడులో చోటుచేసుకుంది. మండలంలోని చిన ఖేర్జెల పంచాయతీ సర్వపాడులో పాడుబడిన ఇల్లు కూల్చే సమయంలో జరిగిన ఘటన ఇద్దరు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో శంకరరావు(33), మాణికమ్మలు(55)గా మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. గిరిజన ప్రాంతాల్లో వరుస జరుగుతున్న ప్రమాదాల కారణంగా గిరిజనులు మృత్యువాత పడటంతో గిరిజన గ్రామాల్లో విషాదఛాయలు అమ్ములుకుంటున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటన మరువక ముందే మరోసారి మండలంలో ప్రమాద ఘటన జరగడంతో గిరిజనులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబ సభ్యులను సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.

సెల్ టవర్ల నిర్మాణాలు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో మొబైల్ టవర్ల నిర్మాణానికి చర్యలు వేగవంతం చేస్తున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి విష్ణు చరణ్ అన్నారు. మండలంలోని పలు గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మొబైల్ టవర్లకు స్థల పరిశీలనను శుక్రవారం పిఒ చేశారు. మారుమూల గిరిజన గ్రామాలైన పుడేసు, కోనలో టవర్లు ఏర్పాటు చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మండలంలోని గిరిజన ప్రాంతాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటుకు ప్రభుత్వ అన్ని విధాలా చర్యలు చేపడుతుందన్నారు. ప్రభుత్వం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికీ టవర్లకు సంబంధించిన స్థల సేకరణ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్, జియో టవర్లకు సంబంధించి స్థల పరిశీలన చేసేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రదేశాన్ని వాటి సర్వే నెంబర్, హద్దులను సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గుర్తించిన ప్రదేశాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా స్థల సేకరణ వేగవంతం చేసి సంబంధించిన మొబైల్ టవర్ల సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాల మేరకు నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ లేక గిరిజన ప్రాంతాల అభివృద్ధి చెందిన పరిస్థితి ఉన్నాయన్నారు. టెలి కమ్యూనికేషన్ గిరిజన ప్రాంతాల్లో విస్తరించడం వల్ల గిరిజన ప్రాంతాలు అన్నివేళలా అభివృద్ధి చెందుతాయని అన్నారు. దీంతో పాటు తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ స్వామి నాయుడు సిబ్బంది ఉన్నారు.

రసాభాసగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశం రసాభసాగా మారింది. నగర పంచాయతీ అధికారుల తీరుపై కౌన్సిలర్లు దుమ్మెత్తిపోశారు. కనీసం తమకు సమాచారం లేకుండా పనులు చేస్తున్నారని, తమపై వివక్షత చూపిస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 25న అత్యవసర సమావేశం జరిగినట్టు తీర్మానంలో చూపించి ఖాళీ పేజీ ఉంచడం పట్ల కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కిల్లారి మోహనరావు, భాసూరు కాంతారావు తదితరులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా మినిట్స్‌బుక్‌లో పొందుపర్చారని నిలదీశారు. ఖాళీ పేజీ ఉంచడానికి కారణమేమిటని ప్రశ్నించారు. తమ అవసరం లేదంటే వెంటనే రాజీనామా చేస్తామని పట్టుపట్టారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు స్పందిస్తూ ఎంఎల్ఎ, ఎంఎల్‌సి దృష్టికి తీసుకువెళ్లి అత్యవసర సమావేశం చేపట్టినట్లు మినిట్స్‌బుక్‌లో పొందుపర్చడం జరిగిందని చెప్పడంతో దానికి కౌన్సిలర్లు అడ్డుతగిలారు. తాము సభ్యులంకాదా, తమకెందుకు సమాచారం ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. అలాగే పట్టణం పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుధ్య నిర్వహణపై దృష్టిపెట్టడం లేదని, లక్షల రూపాయలు నిధులు డ్రాచేస్తున్నారని ఎందుకని ప్రశ్నించారు. ఇటువంటి పనులు వల్ల తమకు చెడ్డపేరు వస్తుందని నగర పంచాయతీ పరిస్థితిని అవసరమైతే సిఎం దృష్టికి, పురపాలక శాఖ రాష్ట్ర మున్సిపల్ సెక్రటరీకి తెలియజేస్తామన్నారు.



సమస్యలపై కమిషనర్‌ను నిలదీస్తున్న సభ్యులు

దొంగనోట్ల కేసులో ఆరుగురికి శిక్ష

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో దొంగనోట్ల చెలామణి కేసులో ఆరుగురు నిందితులకు శిక్ష విధిస్తూ బొబ్బిలి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చిందని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. 2010లో జరిగిన ఈ కేసుకు సంబంధించి మొత్తం ఏడుగురు నిందితుల్లో బంగారమ్మపేటకు చెందిన కంటు వెంకటమ్మ మృతి చెందారని చెప్పారు. మిగిలిన ఆరుగురికి శిక్షలు ఖరాయయ్యాయని తెలిపారు. బంగారమ్మపేటకు చెందిన బూరాడ సూర్యనారాయణ పదేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా, గురమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, చంద్రమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు చెప్పారు. భోగాపురానికి చెందిన చల్లా నూకరెడ్డికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, విశాఖపట్నంకు చెందిన కె.శ్రీనివాసరావుకు, ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, సత్తుపల్లికి చెందిన దాసరి సత్యనారాయణకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. శిక్షలు పడిన నిందితులను జైలుకు తరలించినట్లు టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

పది పరీక్షలకు సన్నద్ధం

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కృషి • ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఆ దిశగా విద్యార్థులను సానపడుతున్నారు. వెనుకబడిన విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ఉపాధ్యాయులు వారి బాధ్యత తీసుకొని దగ్గరుండి చదివిస్తున్నారు. పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 11,336 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. జనవరి నెలాఖరుకే ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేసి, పునశ్చరణ చేయించారు. ఏ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడి ఉంటే, అందులో అదనపు తరగతులు నిర్వహించారు. 100 రోజుల ప్రణాళిక, రోజువారీ పరీక్షలు, గ్రాండ్ టెస్ట్‌లు, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సిద్ధం చేశారు.

సెల్ఫ్ టెస్ట్‌ల పేరుతో ప్రత్యేక శ్రద్ధ

సెల్ఫ్ టెస్టులో పేరుతో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల్లో ఒక్కొక్కరు కొంతమంది వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని చదివించే బాధ్యత తీసుకున్నారు. తరగతి గదిలో చెప్పే పాఠాలలో ఏదైనా సందేహాలు కలిగినప్పుడు వాటిని పాఠశాల ముగిసిన అనంతరం నిర్వహించే శిక్షణా తరగతులలో నివృత్తి చేస్తున్నారు. విద్యా శాఖ ఆదేశాలు ప్రకారం ఉదయం 8 గంటల నుంచి 9 వరకు మధ్యాహ్న 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సెల్ఫ్ టెస్ట్ పేరుతో ప్రతి రెండు పాఠ్యాంశాలు పూర్తి అయిన వెంటనే పరీక్ష నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పూర్తి కాన్ఫిడెన్స్ పెరగడానికి దోహదపడింది.



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

తల్లిదండ్రులతో సమావేశాలు

పిల్లల చదువు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లితండ్రుల సమావేశాల నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గతంలో రెండు పేపర్ల విధానం ఉండేటప్పుడు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేవారు. ఇప్పుడు రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయం సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకుని పరీక్షలంటే ఆందోళన చెందకుండా మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేశారు.

గ్రేడ్లుగా విభజించి ప్రత్యేక తరగతులు

గతేడాది పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో గణితం, సైన్సు పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తర్ఫీదునిచ్చారు. ఎస్‌ఎ-1 పరీక్షలలో ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

ప్రాథమిక అంశాల నుండి బోధన



ఇప్పుడున్న పదో తరగతి విద్యార్థులకు రెండేళ్ల కరోనా కారణంగా సరిగా చదవకపోవడంతో ఈ ఏడాది కొంచెం కష్టంగా మారింది. దీంతో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి అంశాల నుంచి ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాలు వారికి అర్థమయ్యేలా ప్రత్యేకంగా బోధించడమైంది. ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్టడీ అవర్స్ నిర్వహించి, విద్యార్థులు ఇంటి దగ్గర చదువుకోవడానికి ప్రత్యేకమైన టైం టేబుల్ తయారు చేసి విద్యార్థులకు అందించడం జరిగింది. దీనివల్ల విద్యార్థులు ఏఏ సబ్జెక్టులు ఎంత టైం ఏ విధంగా చదువుకోవాలో స్పష్టంగా అర్థమవుతుంది. కనీస సామర్థ్యాలు కూడా లేని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది. విద్యార్థులు ఇంటిదగ్గర ఉండే సమయంలో ఉపాధ్యాయులు కూడా రాత్రిపూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్నారో లేదో గమనించడం జరుగుతుంది. మా పాఠశాలలో చదువుతున్న నలుగురు సిడబ్ల్యూఎస్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారంతా ఉత్తీర్ణతత సాధించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

విజయ్ కుమార్, హెచ్‌ఎం, జెడ్‌పి హైస్కూల్, ఎంఆర్ నగరం.

రెండు పూటలా స్టడీ అవర్స్



ఈ సంవత్సరం మా పాఠశాల నుంచి 93 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 52 మంది తెలుగు మీడియం విద్యార్థులు, 41 మంది ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులతో మూడుసార్లు సమావేశం ఏర్పాటు చేశారం. టెన్త్ విద్యార్థుల కోసం ఎప్పటికప్పుడు అసైన్మెంట్లు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే ఒక్క ఉపాధ్యాయులు ఐదుగురు చొప్పున విద్యార్థులను దత్తత తీసుకొని వారి పురోగతిపై ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి తగిన సూచనలు చేస్తున్నారు.

డి. శోభారాణి, హెచ్‌ఎం, టిఆర్‌ఎంఎం గర్ల్స్ హై స్కూల్, పార్వతీపురం

స్టడీ అవర్స్‌తో ఎంతో లాభం



ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్టడీ అవర్స్ నిర్వహించడం వల్ల చదివేటప్పుడు ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం కలిగింది. బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తా.

మాధురి, విద్యార్థిని, టిఆర్‌ఎంఎం బాలికల ఉన్నత పాఠశాల, పార్వతీపురం.

పరీక్షల ఒత్తిడి భయం తగ్గింది



ఎప్పటికప్పుడు అసైన్మెంట్లు నిర్వహించడం వల్ల పరీక్షల భయం, ఒత్తిడి తగ్గింది. అర్థం కాని లెక్కలు, ప్రశ్నలను మళ్లీ, మళ్లీ ఉపాధ్యాయులను అడిగి అన్ని విషయాలను అర్థం చేసుకుంటున్నాం.

స్పందన, విద్యార్థిని, టిఆర్‌ఎంఎం బాలికల ఉన్నత పాఠశాల, పార్వతీపురం.



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాజన్నదొర

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

సాలూరు : వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను శుక్రవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర పరిశీలించారు. అంతకుముందు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. వసతి సమస్యలు ఉన్న దృష్ట్యా రోగులకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలందించాలని ఆదేశించారు. వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే మెరుగైన సేవలందుతాయని చెప్పారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టరు ని కోరారు.

యువతను మోసగించిన సిఎం

పార్వతీపురం రూరల్ : గత ఎన్నికల ముందు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలతో పాటుగా యువతకు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వారికి ఏం చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జాబ్ కేలండర్ ప్రకటించడమే కాకుండా 20వేల ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇవ్వడంతో యువత ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకొని అధికారాన్ని అప్పగించారని అన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన హామీలను విస్మరించి అన్యాయం చేశారని విమర్శించారు. రాబోయే కాలంలో జగన్‌కు బుద్ధి చెప్పడానికి యువత సిద్ధంగా ఉందని అన్నారు.

నేడు వైఎస్‌ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

భామిని : వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శనివారం భామినిలో ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అందజేయనున్నట్టు ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, ఎపిఎం డి.భవాని ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 702 మహిళా సంఘాలకు రూ.3 కోట్ల 72 లక్షల చెక్కులు పంపిణీ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గురుకులాల్లో ఖాళీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సీతానగరం : మండలంలోని జోగంపేట గురుకుల పాఠశాల స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ శుక్రవారం బలిజిపేట పరిధిలో గల గురుకుల పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ చేస్తున్నట్లు పిఒ సి.విష్ణు చరణ్ తెలిపారు. జోగింపేట ప్రతిభ పాఠశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు శనివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ పోస్టులకు 52 మంది దరఖాస్తులు చేసుకున్నారని 20 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. అనంతరం జోగింపేట పాఠశాల విద్యార్థుల విద్యావైజ్ఞానిక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సీతానగరం ఎంపిడిఒగా ప్రసాద్

సీతానగరం : మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఎంఎల్‌ఎన్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన బి.కృష్ణమహేశ్ రెడ్డి ఆరు నెలలు శిక్షణకు వెళ్లనుండడంతో ఆ బాధ్యతలను ఇఒపిఆర్డీగా పనిచేస్తున్న ప్రసాద్‌కు అధికారులు అప్పగించారు. ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎసి సుధారాణి, ఎస్‌డిసి భారతి

ఆలయ భూములపై దర్యాప్తు

బొబ్బిలి: వేణుగోపాలస్వామి, సీతారామస్వామి ఆలయాల భూములపై దేవాదాయశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం వేణుగోపాలస్వామి, గుల్లసీతారాంపురం సీతారామస్వామి ఆలయాల భూములకు సంబంధించి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు భూరికార్డులను పరిశీలిం చారు. గుల్ల సీతారాంపురం ఆలయ పరిధిలో 18 గ్రామాల్లో 2,280.53 ఎకరాలు, బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో 18 గ్రామాల్లో 2,167.02 ఎకరాల భూమి ఉందని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డిసి డి.భారతి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఆలయ భూములను గుర్తించి సరిహద్దులు వేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నట్లు చెప్పారు. సర్వే నంబర్ల వారీగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బలిజిపేట మండలంలోని అజ్జాడలో 714.85 ఎకరాలు భూమి ఉంటే 473.19 భూములను గుర్తించామని, ఇప్పటికి 3.50 ఎకరాలకు మాత్రమే రైతుల నుంచి రూ.5 వేలు ఆదాయం వస్తుందని ఇఒ ప్రసాద్ చెప్పారు.

4న సీతంపేట మండల సమావేశం

సీతంపేట : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 4న మంగళవారం స్థానిక వైటిసిలో ఎంపిపి బీడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ కె.గీతాంజలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని, అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

ఎంపిడిఒగా విజయలక్ష్మి

పార్వతీపురం రూరల్ : మండల అభివృద్ధి అధికారిగా శుక్రవారం విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని పలువురు ఎంపిడిఒలకు ప్రభుత్వం ఆరు నెలల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున, ప్రస్తుతం ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న అకిబ్‌జావేద్ కూడా శిక్షణకు వెళ్లనున్న నేపథ్యంలో, ఈమె బాధ్యతలు సేకరించినట్లు తెలిపారు. ఈమె గతంలో జిల్లాలో పలు మండల కార్యాలయాలలో విధులు నిర్వహించిన అనుభవం ఉంది.

గుంతలున్నాయి జాగ్రత్త..!

బలిజిపేట : స్థానికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న బోరు వద్దకు నీరు కోసం వచ్చే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజేశ్వరి తెలిపారు. పాఠశాలలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు పెద్ద పెద్ద గుంతలు తీశారని, ఇవి బోరు దగ్గరికి మంచినీటి కోసం వస్తున్న మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

భామినిలో శిలువ యాత్ర

భామిని : మండల కేంద్రమైన భామినిలో ఫాదర్ చార్లెష్, ఫాదర్ రాజు, బ్రదర్ ఎంథోని ఆధ్వర్యంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున వీధుల్లో శిలువ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా శిలువ వేయడానికి ముందు జీసస్ ఏ విధంగా 14 స్థలాల్లో బాధింపబడ్డారనే దృశ్యాలను క్రైస్తవ దీక్ష పరులు, శిలువ మోస్తూ జీసస్ వేష ధారణ ఉన్న కవిటి రాజు వీధుల్లో ప్రదర్శిస్తూ, మహిళలు పాటలు పడుతూ శిలువ యాత్రను నిర్వహించారు. పాప పరిహారానికి ఈ శిలువ యాత్ర అని, ప్రపంచ సమస్త జీవరాసికి శాంతికై ప్రభువు మరణించారని, పాపులను పరిశుద్ధులుగా చేయడానికి తన రక్తాన్ని జీసెస్ ధారపోశారని, ఏసు పుట్టుక, మరణం రెండు చాలా గొప్పవని ఫాదర్ చార్లెష్ ప్రసంగించారు. కార్యక్రమంలో భామిని సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, లోపింటి రాజేష్, చరణ్, ప్రసాద్, కాంతారావు, లోపింటి జెడ్డయ్య వున్నారు.



పురవీధుల్లో శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

పన్నుల పెంపుపై కౌన్సిల్లో రగడ

వైసిపి కౌన్సిలర్ల మధ్య భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో ఇంటి పన్ను యజమాని పేరు, ఖాళీ స్థలం యజమాని పేరు మార్పులకు సంబంధించిన రుసుం పెంపు విషయంలో కౌన్సిలర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశం అజెండాలో ఈ అంశంపై చర్చ మొదలైంది. 2015లో చేసిన తీర్మానం అనుసరించి రిజిస్ట్రేషన్‌పై మార్కెట్ విలువ పెరిగిన కారణంగా పట్టణంలోని ఇంటి పన్ను యజమాని పేరు, ఖాళీ స్థలం యజమాని పేరు మార్పులకు సంబంధించిన రుసుము పెంపు విషయంలో కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఇంతవరకు ఈ రుసుం కనిష్ఠంగా రూ.250, గరిష్ఠంగా రూ.3వేలు ఉండేది. అయితే భూముల మార్కెట్ ధర, రిజిస్ట్రేషన్ ధరలు పెరగడంతో ఇంటి పన్ను యజమాని, ఖాళీ స్థలం యజమాని పేరు మార్పులకు సంబంధించిన రుసుములు కూడా పెంచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రూ.50వేల ఆస్తి విలువ లున్నప్పుడు చెల్లించాల్సిన రుసుం రూ.250 ఉంటే అది ఇప్పుడు రెట్టింపు అయింది. 12స్లాబ్‌ల్లో రుసుము చెల్లింపు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఆస్తి విలువలో కనీసం ఒక శాతానికి తక్కువ కాకుండా రుసుము వసూలు చేయాలని నిర్ణయించడంపై కౌన్సిలర్లు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీనివల్ల సంపన్నులపై ఆర్థిక భారం పడుతుందని, పేదలకు ఇబ్బంది లేదని కమిషనర్ హెచ్ శంకరరావు చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ఆదాయ, వ్యయాలను దృష్టిలో పెట్టుకొని ఈ అంశాన్ని ఆమోదించాలని ఆయన కోరారు. అన్ని మున్సిపాలిటీల్లో దీన్ని ఆమోదించారని చెప్పారు. దీనిపై వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు మాట్లాడుతూ ఇలాంటి కీలకమైన అంశంపై ముందుగా చైర్ పర్సన్ కౌన్సిలర్లతో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి చైర్‌పర్సన్ అంగీకరించారు. ఈ అంశం గురించి ముఖ్యమైన నాయకులకు చెప్పానని, చైర్ పర్సన్‌అందుబాటులో లేకపోవడంతో పెట్టలేదని చెప్పారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిపుష్టికి రుసుము పెంపు విషయంలో అనవసర రాద్ధాంతం వద్దని వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి చెప్పారు. వైసిపి సీనియర్ కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, బి.శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల్లోనూ పెంచినప్పుడు ఇక్కడ కూడా పెంచడం మంచిదేనని, అయితే తగ్గించడానికి అవకాశం వుంటే ఆలోచన చేయాలని సూచించారు. ఒక శాతం కంటే తక్కువ ఉండరాదని నిబంధనలు సూచిస్తున్నాయని కమిషనర్ శంకరరావు చెప్పారు. ఇప్పుడు ఆమోదించక పోతే మరో ఏడాది పాటు నిరీక్షించా ల్సిన పరిస్థితి వుందని స్పష్టం చేశారు. దీంతో కౌన్సిలర్లు ఆ అంశాన్ని ఆమోదించారు. పట్టణ వైసిపిలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు మరోసారి ఈ సమావేశంలో బయటపడ్డాయి.



మహిళా సంఘ గ్రూపులకు చెక్కును అందజేస్తున్నఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆసరాతో మహిళలకు మరింత అండ

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

వైఎస్‌ఆర్ ఆసరా మహిళలకు మరింత అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. స్థానిక ఎఎంసి ఆవరణలో శుక్రవారం మూడోవిడత ఆసరా కార్యక్రమంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం వల్ల మహిళా సాధికారిత మరింత మెరుగుపడుతుందని, ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, అనీల్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మహిళలు పాల్గొన్నారు.

అందరూ మెచ్చే చిత్రం తీస్తాం.. ఆదరించండి

కౌసల్య, తనయ రాఘవ చిత్ర నిర్మాత రత్నాకర్

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

కుటుంబ సమేతంగా చూసి అందరూ మెచ్చే ఓ మంచి చిత్రాన్ని అందిస్తామని, తమను ఆదరించాలని కౌసల్య తనయ రాఘవ చిత్ర నిర్మాత అడపా రత్నాకర్ తెలిపారు. కౌసల్య తనయ రాఘవ చిత్రాన్ని నిర్మించే క్రమంలో పాలకొండలోనికోటదుర్గ అమ్మవారికి ఆలయ ఆవరణలో శుక్రవారం విలేకరు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ చిత్ర నిర్మాణం తన కల అని, దాన్ని సాకారం చేసుకునే క్రమంలో ఓ మంచి సినిమాను రూపొందించే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. చిత్ర దర్శకుడు స్వామి పట్నాయక్ మాట్లాడుతూ తాము తీయబోయే చిత్రం చిన్నదైనా పెద్ద సందేశం ఇస్తామన్నారు. తాను కొన్ని మంచి షార్ట్‌ఫిల్మ్ తీశానని, ఆ అనుభవంతోనే కౌసల్య తనయ రాఘవ చిత్రాన్ని తీస్తాననని తెలిపారు. కో ప్రొడ్యుషర్ శ్యాం మాట్లాడుతూ రత్నాకర్‌తో పాటు అద్భుతమైన షార్ట్‌ఫిల్మ్‌లు అందించిన స్వామి సహకారంతో ప్రేక్షకులు మెచ్చే కుటుంబ చిత్రాన్ని అందిస్తామన్నారు. అంతకు ముందు చిత్ర యూనిట్ కోటదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

రక్తహీనత నివారణే ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో రక్త హీనత నివారణే ధ్యేయంగా వైద్యాధికారులు పనిచేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో కలెక్టర్ శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిహెచ్‌సిల పరిధిలో రక్త హీనత పరీక్షలు చేయాలని, గణాంకాలు వాస్తవంగా ఉండాలని సూచించారు. మక్కువ, పెదంకలాం, ఎం.సింగుపురం, బాలేరు, శంబర, అరసాడ తదితర పిహెచ్‌సిల పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఆర్‌బిఎస్‌కె పీడీ, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, ప్రోగ్రాం అధికారులు సందర్శించి పరీక్షలు నిర్వహించి ఏప్రిల్ నాటికి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. రక్త హీనత పరీక్షలపై నిర్లక్ష్యం వహిస్తున్న ఎఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనత నివారణలో చురుకైన పాత్రను పోషించి సంతప్తి సాధించాలన్నారు. కిశోర బాలికలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. హైరిస్క్ గర్భిణీలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గర్భిణీల హిమోగ్లోబిన్ పరిశీలించాలని, మాతా శిశు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. మాతా, శిశు మరణాలు గణనీయంగా తగ్గాలన్నారు. టీకాల కార్యక్రమం (ఇమ్యునైజేషన్) శత శాతం జరగాలని, ప్రతి ఒక్కరి వద్ద టీకాల కార్డు ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలని, గర్భిణీలకు ఆరోగ్య కార్డులు ఉండాలని అన్నారు.

మలేరియా స్ప్రేయింగ్ కు కమిటీలు

జిల్లాలో మలేరియా స్ప్రేయింగ్‌కు గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మే 15 నుంచి స్ప్రేయింగ్ జరగనున్నట్లు ఇన్‌ఛార్జ్ జిల్లా మలేరియా అధికారి డా.శ్యామ్ కుమార్ తెలపగా, ఆశా, ఎఎన్‌ఎం, తదితరులతో కమిటీ ఏర్పాటు చేసి, స్ప్రేయింగ్ జరిగే సమయంలో కమిటీ సభ్యులు పక్కాగా హాజరయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమంపై పర్యవేక్షణ ఉండాలని, పిఎంఐడిసి సాలూరు, పార్వతీపురంలో చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పిహెచ్‌సిల పరిధిలో రహదారులు, భవనాలు శాఖ చేపడుతున్న పనులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు, డిహెచ్‌సిఎ బి.వాగ్దేవి, ఆర్‌బిఎస్‌కె పీడీ ధవళ భాస్కరరావు, ఇన్‌ఛార్జ్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు డివి రమణ, ప్రోగ్రాం అధికారులు వినోద్, టి.జగన్మోహనరావు, శ్యామ్ కుమార్, ఆర్ అండ్ బి ఇఇ ఎం. జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నదొరను కలిసిన జయమణి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొరను ఎస్‌సి కమిషన్ సభ్యులు సవరపు జయమణి శుక్రవారం ఆయన స్వగృహంలో మర్యాదగాపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు. ఆమె వెంట వైసిపి నాయకులు ఎస్.రామారావు ఉన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన డివిజి శంకరరావు

సాలూరు : డిప్యూటీ సిఎం రాజన్నదొరను మాజీ ఎంపి డాక్టర్ డివిజి శంకరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి ఎస్టీ సెల్ జోనల్ ఇంఛార్జి గా డాక్టర్ డివిజి శంకరరావు ని పార్టీ అధిష్టానం నియమించిన నేపథ్యంలో ఆయన రాజన్నదొరను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చడానికి తీర్మానించడం ద్వారా నెలకొన్న ఆందోళన నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. తనను విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఎస్టీ సెల్ జోనల్ ఇంఛార్జి నియమించడానికి సహకరించిన డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



రాజన్నదొరను సన్మానిస్తున్న ఎస్‌సి కమిషన్ సభ్యులు జయమణి

అమ్మవారి పండగను ప్రభుత్వం నిర్వహించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో త్వరలో జరగనున్న అమ్మవారి పండగను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు హాజరయ్యారు. ముందుగా అజెండాలో అంశాలను మున్సిపల్ అధికారి చదివి వినిపించారు. పట్టణ సమగ్ర అభివృద్ధిపై సాగిన కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన అనంతరం జిల్లా కేంద్రంలో అమ్మవారి పండుగను వచ్చే మే నెలాఖరున జరపనున్న సందర్భంగా ఈ పండుగను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరుతూ కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించి కలెక్టర్‌కు పంపించారు. ఈ అంశంపై ఇప్పటికే ఎమ్మెల్యే సంబంధిత దేవాదాయ శాఖ అధికారులతోనూ, కలెక్టర్ తో మాట్లాడి జిల్లా కేంద్రంలో మొట్ట మొదటి సారిగా నిర్వహించబడుతున్న అమ్మవారి పండుగను శంబర పోలమాంబ, విజయనగరం పైడితల్లి అమ్మవార్ల పండగలానిర్వహించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రధాన రహదారి కూడళ్లలో విద్యుత్ కాంతులతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారి యంత్రాంగ కృషి చేయడం అభినందనీయమైన విషయమని సభ్యులు కొనియాడారు. సమావేశంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

నేరాలు ఘోరాలు



నదిఒడ్డుకు కొట్టుకొచ్చిన కార్తీక్ మృతదేహం

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల పంచాయతీ పరిధి కడకెల్ల సమీపంలో నాగావళ్లి నది ఒడ్డున శుక్రవారం గరుగుబిల్లి మండలం కొత్తూరుకు చెందిన అన్ను కార్తీక్ (17) యువకుడి మృతదేహం లభ్యమైనట్లు ఇన్చార్జ్ ఎస్‌ఐ కిషోర్ వర్మ తెలిపారు. కొత్తూరుకు చెందిన కార్తీక్ ఈనెల 30న నాగావళ్లి నదిలో స్నానానికి దిగి అదృశ్యం కావడంతో తండ్రి వెంకటి తన కుమారుడు అదృశ్యమైనట్లు గరుగుబిల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం కడకెల్ల సమీపంలో మృతదేహం పడిఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కిషోర్‌వర్మ, సిబ్బంది మృతదేహం ఉన్న స్థలానికి చేరుకొని పరిశీలించారు. తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిషోర్ వర్మ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంరూరల్ : సీతానగరం మండలం బుడ్డిపేటకు చెందిన బొత్స నాగరాజు మద్యానికి బానిపై బాధ్యత లేకుండా ప్రవర్తించడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు తీవ్రంగా మందలించారు. తాగి ఇంటికి వస్తే ఇంటికి రానిచ్చేది లేదని కచ్చితంగా చెప్పడంతో మనస్థాపానికి గురైన నాగరాజు ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్పందించిన స్థానికులు, సీతానగరం పిహెచ్‌సికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స అందిస్తున్నారు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.